# చివరి చూపు

ఎవరైనా చనిపోయినపుడు, ఆ వ్యక్తి మంచితనం గురించి, అతని అనారోగ్యం గురించీ మాట్లాడుకోవటం సహజం. కానీ ఆ ఊళ్ళో ఆ రోజు చనిపోయిన చలపతి గురించి తక్కువగానూ, చివరి చూపుకు కూడా హాజరవని అతని చిన్న కొడుకు గురించి ఎక్కువగానూ చెప్పుకోవటం జరిగింది.

'ఎపుడో తండ్రి మందలించాడని చదువు మానేసి ఇంటినుండి పరారైనవాడు తండ్రిని చూడటానికి వస్తాడనే కబురు చేశారా... అతగాడు వస్తాడని నేనెపుడూ అనుకోలేదు...'

'నిజమేగానీ, ఆమధ్యనోసారి వచ్చి చూసి వెళ్ళాడటకదా... అందుకేనేమో చలపతి తన చిన్నకొడుకుకూ తన మంచం పట్టి ఉన్న మాట చెప్పి వెంటనే రమ్మని కోరాడట... కబురు వెళ్ళిందనుకున్నారుగానీ, అతను మాత్రం పత్తాలేడు...'

'ఏమాటకామాటే చెప్పుకోవాలి. చలపతి అన్నయ్యకు ఉండటానికి ముగ్గురు కొడుకులని లెక్కేగానీ, పెద్దవాళ్ళిద్దరూ కనిపెట్టి చూసినట్లు ఆఖరివాడు ఒక్కరోజైనా తల్లికీ, తండ్రికీ సేవ చేసాడా...? అయినా చలపతి అన్నయ్య ధ్యాస అంతా ఆ చిన్నకొడుకు రాక గురించే ! మాటపడిపోయినా, అతను వస్తాడేమోననే ఆశతో కాబోలు అతని చూపు అంతా వాకిలి గుమ్మంవైపే నట ! ఎవరికైనా అంతే కాబోలు, దగ్గరుండి కనిపెట్టి సేవ చేస్తున్నవాళ్ళమీద కాకుండా దూరంగా ఉండి పట్టీ పట్టనట్లున్నా, వాళ్ళమీదకే మనసు లాగుతుంది...! నిజంగా విడ్డూరమే...!'

'మూడో వాడు ఎలా ఉంటేనేంగానీ, చలపతి పెద్ద కొడుకు లిద్దరూ మాత్రం బుద్ధిమంతులు! ఆ కోడళ్ళిద్దరి గురించీ ముఖ్యంగా చెప్పుకోవాలి. పోటీలు పడీ మరీ మావగారికి సేవలు చేస్తున్నారు...!'

'అవును... పిల్లలకి పరీక్షల టైము అయినా అదేం లెక్క చేయకుండా పెద్ద కోడలి ఒక్కదాని మీదే భారం పెట్టటం ఎందుకనీ, రెండో కోడలూ పిల్లల్ని ఆయన దగ్గిర వదిలి వచ్చేసింది. అత్తగారికి కోడళ్ళిద్దరూ ఎంత అండగా ఉంటున్నారో...!'

'అది నిజమే అయినా ఇంకోమాటా వినిపిస్తోంది...! సేవ చేస్తోందని అత్తగారు గానీ తన నగా నట్రాలో పెద్దకోడలకి ఎక్కవ భాగం ఇస్తుందేమోననే భయంతో ఆరా తీయటానికి సాయంగా చిన్నకోడలూ వచ్చేసిందటా...! ఇందులో నిజమెంత ఉందో మనకేం తెలుస్తుంది...!'

'అవును... ఈ మాట నేనూ విన్నాను. రెండు మూడు నెలలకోసారి అయినా ఇద్దరు కొడుకులూ వచ్చి రెండు మూడు రోజులుండి వెళ్ళేవాళ్ళు... వెళ్ళేటప్పుడు ఇద్దరికీ తూచినట్లు సరిసమానంగా పిండివంటల డబ్బాలూ, పప్పుల మూటలూ ఇచ్చి అత్తగారు పంపిస్తూ ఉండేది! ఒకసారి చూసి నేనీ మాట అడిగాను... 'పెద్దవాడు అసలు తీపి వంటలు తినడని అంటావుగా వదినా, వాళ్ళకీ ఎందుకన్ని పిండివంటలూ...' అంటే ఏం చెప్పిందో తెలుసా... 'ఎక్కువ తక్కువలనే మాట రాకూడదనీ' అంది! అంటే... ఇలాంటి పొరపొచ్చాలు వీళ్ళకీ ఉన్నాయి కాబోలనుకున్నా...!'

'ఎందుకుండవూ... ఒకే ఇంట్లో పెరిగిన వాళ్ళ మధ్యనే ఎన్నో తేడాలు వస్తూంటే, వేర్వేరు ఇళ్ళనుండి పెరిగి వచ్చిన కోడళ్ళ మధ్య అంత సయోధ్య ఎలా కుదురుతుందీ....!'

'ఏదయితేనేంలే, ఇంటిగుట్టు బయటకు రాకుండా ఇద్దరు కొడుకులూ కలిసికట్టుగా తండ్రిని కనిపెట్టుకుని చూసుకున్నారు! అది చలపతి అదృష్టం... అలాంటి కొడుకులు ఉండటం...! ఆఖరివాడు మాత్రమే కొంచె తేడా... లేకపోతే తండ్రి కోరిక మన్నించి వచ్చివుంటే... ఎంత మర్యాదగా ఉండేదీ...?'

'అయినా తండ్రి చనిపోయాక కూడా ఇంకా అతనికి కక్ష ఏమిటో...! చిన్నతనంలో అయితే జ్ఞానం లేక... తండ్రి తన బాగుకోసమే కోప్పడ్డాడని అనుకోకుండా అలిగి వెళ్ళిపోయాడు సరే, ఇపుడు పెద్ద వాడయ్యాడు కదా, ఆ మాత్రం తెలివీ, బుద్ధీ రాలేదా...? చనిపోయిన తండ్రి కాళ్ళకు దండం పెట్టుకుంటే... పుణ్యమే వస్తుందిగానీ, పాపం చుట్టుకోదు కదా!'

'దూరంగా ఉంటున్నమాట నిజమే అయితే మాత్రం... ఖర్చులంటూ లెక్క వేసుకోకుండా పరిగెట్టుకు రావద్దా... ఎంత కావాలనుకున్నా తండ్రి మొహం మళ్ళీ కనిపించదు కదా... ఈ మాత్రం లేకపోయిందెందుకో...!'

'అవునీ మాట... కొడుకు లిద్దరూ అనుకోవటం నేనూ విన్నాను. పాపం... చలపతి ప్రాణం ఎంత కొట్టుకుపోయిందో అతన్ని చూడాలని!'

'అది గమనించే కొడుకు లిద్దరికీ చిరాకు వచ్చింది! కోడళ్ళూ నిష్ఠూరపడ్డారు. కనిపెట్టుకుని రాత్రి, పగలూ అని తేడా లేకుండా సేవలు చేస్తున్న వాళ్ళను కాదనుకున్నట్లుగా... అతని కోసం అంతలా ఎదురు చూడటం ఏమిటీ...! మరి వాళ్ళకీ చిరాకు వచ్చిందంటే, ఎందుకు రాదూ....?'

ఇలా రకరకాల వ్యాఖ్యానాలలో ఆవూరి ఆడవాళ్ళూ, మగవాళ్ళూ ఆ కుటుంబం గురించి చెప్పుకోవటం జరిగింది.

రెండు రోజులు గడిచేసరికి ఇంట్లోనూ అదే చర్చ జరిగింది.

పెద్దకొడుకు హరి తల్లితో ''చూశావా అమ్మా... నాన్న కడసారి చంద్రాన్ని చూడాలని ఎంత తపన పడ్డాడో... ఆఖరు గడియల్లో ఉన్నారని వెంటనే బయలుదేరి రమ్మని చెప్పినా వాడు ఇలా చేశాడు! కన్నతండ్రి కడసారి చూపుకూ రాకపోవటం గురించే మన ఊళ్ళో వాళ్ళందరూ ఎంత విస్తుపోతున్నారో.....!'' అన్నాడు.

కొడుకు మాటలకు అనసూయమ్మ నిట్టూర్చింది. ''అవును... అందరూ అదే మాట చెప్పుకుంటుంటే నాకూ సిగ్గులో తలకొట్టేసినట్లయింది! మనమైనా కబురు అందించగలంగానీ, ఒప్పించలేంగా!''

తల్లి మాటల్లోని రోషాన్నీ, బాధనీ గుర్తించిన రెండో కొడుకు గిరి ఆవేశంగా అన్నాడు.

''నాన్న పాపం వాడి రాక గురించి ఆదుర్దా పడుతున్నట్లుగా మాటిమాటికీ గుమ్మంవైపు చూస్తూ, ఏదో చెప్పాలనుకుంటూ చెప్పలేక ఎంత అవస్థ పడ్డాడో...! అది చూసేసరికి నాకు మరీ ఏడుపు వచ్చేసింది!''

అనసూయమ్మ కళ్ళు తుడుచుకుని కొడుకులు ఇద్దరి చేతులూ ఆప్యాయంగా పట్టుకుంది. ''ఏం చేస్తాం... మాకు ఇద్దరు కొడుకులే అనుకోవాలి! మనం వద్దనుకుని ఎపుడో పరాయైపోయిన వాడు... ఆ మధ్య వస్తే... మార్పు వచ్చిందనుకుని ఎంత సంబరపడ్డామో..! కానీ చివరి చూపుకుకూడా రాకుండా ఉండగలడని నేను అనుకోలేదు...!'' ఆవిడ గొంతు గద్గదమైంది.

''పోనీలేమ్మా... వాడి సంగతి మనమూ పూర్తిగా మరిచిపోవటమే మంచిది! వెంటనే బయటుదేరి రావటానికి చాలా దూరంలో ఉంటే మాత్రమేం, కొంతవరకూ ఫ్లైటులో వచ్చి, ఆ తర్వాత ట్రైనో, బస్సో పట్టుకుని వచ్చివుంటే... ఎంత బావుండేది...! తన దగ్గర సరిపడా డబ్బు లేకపోతే మాత్రం, అప్పుచేసి అయినా వస్తే, మనం తిరిగి ఇవ్వటానికి ఏర్పాటు చేయమా...?!' అన్నాడు హరి మళ్ళీ కోపంగా.

వెంటనే గిరి అందుకుని అన్నాడు ''అవును... ఆ మాత్రం ఆలోచన వాడికి వచ్చి ఉండదా...? ఇంకో కారణం ఏదో ఉండే ఉంటుంది! ఎవ్వరికీ చెప్పకుండా పెళ్ళి చేసుకున్నాడుగా, ఆమెగారేమైనా అభ్యంతరం చెప్పిందేమో....!''

పెద్ద కోడలు నిష్టూరం నిండిన గొంతులో తన అభిప్రాయం వెలిబుచ్చింది. ''ఈ మాట నేనూ అందామనుకుని లేనిపోని నిందలు వేస్తున్నానని అనుకుంటారని పూరుకున్నాను!''

అవునన్నట్లుగా తలవూపుతూ రెండోకోడలూ అదే అభిప్రాయం తనదీ అన్నట్లుగా మాట్లాడింది. ''బంధం వదులుకున్నాక, మళ్ళీ కలుపుకోవటం ఎందుకూ అనవసరమైన చాకిరీ చేయాల్సి వస్తుందనుకుంటూ దూరంగానే ఉండిపోవాలనుకున్నారేమో మరీ!''

ఇంట్లో బంధువులు ఇంకా ఉన్నందున ఈ మాటలన్నీ ఎందుకులే అంటూ అనసూయమ్మ మెల్లగా అనేసరికి అందరూ ఆ విషయం గురించి మాటలు ఆపేసి నిశ్శబ్దమైపోయారు.

ఆశ్చర్యంగా... అన్ని కార్యక్రమాలూ పూర్తయి, బంధువులంతా ఎవరి ఊళ్ళకు, ఇళ్ళకూ వాళ్ళు చేరుకున్నాక... అపుడు చంద్రం వచ్చాడు.

అలసటగా, నీరసంగా ఉన్న కొడుకువైపు నిర్లిప్తంగా చూసిన అనసూయమ్మ ఏం మాట్లాడలేక కళ్ళు తుడుచుకుంది.

కొడుకులు, కోడళ్ళూ కూడా అతనివైపు నిరసనగా చూసారు గానీ పలుకరించాలని అనిపించలేదెవరికీ, అతనూ దిగులుగా చూస్తుండిపోయాడు.

ఆమరునాడు కుటుంబసభ్యులు మాత్రమే ఉన్నపుడు హరి అందరినీ ఉద్దేశించి తన నిర్ణయాన్ని చెప్పుకు వచ్చాడు.

''మనసుకు కష్టంగా అనిపించినా తప్పదు. అందుకే... మనసును గట్టి చేసుకుని ఈ ఏర్పాటు చేస్తున్నాను. నాన్నకి మేం ఇద్దరమే అన్నట్లుగా ఆస్తిపాస్తులన్నీ రెండు వాటాలుగా మాత్రమే వేయాలని అనుకుంటున్నాను. ఎపుడో చాలా సంవత్సరాలకి ఒకసారి మాత్రం ఇంటికి వచ్చి బాధ్యతల్ని పట్టించుకోకపోవటం మాత్రమే కాదు, తన విషయాలేవీ కుటుంబ సభ్యులకూ తెలియజేయాలన్న జ్ఞానం కూడా లేనివాడిని మనమూ వదిలేద్దాం! ఈ ఊరుకు ఆ ఊరు ఎంత దూరమో, ఆ ఊరుకు ఈ ఊరూ అంతే అంటారు కదా...!

ఇక... అమ్మ ఒక్కతే ఈ ఊళ్ళో ఉండలేదు. ఏదో అలవాటైన ప్రదేశమని అనుకుంటుందే తప్ప ఒంటరిగా ఉండలేదు. మా ఇద్దరికీ వచ్చి ఉండే వీలు లేదు... ఉద్యోగాలున్నాయి కనుక, అందుకనే మనకున్న పొలాన్నీ, ఈ ఇల్లునూ అమ్మేసి... రెండు వాటాలు సమానంగా వేసి పెద్దల ముందు రాతకోతల పని పూర్తిచేస్తాం.

ఇక అమ్మ మా ఇద్దరి దగ్గరా చెరి ఆరు నెలలూ చొప్పున కాలక్షేపం చేస్తుంది.'' అతని మాటలకు అంగీకారసూచకంగా గిరి తలవూపాడు.

''అవునన్నయ్యా... బాధ్యత, బరువు తనమీద పడుతుందేమో ననే భయంతో కన్నతండ్రిని ఆఖరు సారి చూసుకోవటానికి కూడా రానివాడికి ఆస్తిపాస్తుల్లో భాగాలు మాత్రం ఎందుకు....? మేం ఇద్దరం నాన్న చెప్పినట్లు నడుచుకున్నాం... ఇపుడు అమ్మని అలాగే కనిపెట్టుకుని చూసుకుంటాం...!'' అన్నాడు గిరి.

అపుడు చంద్రం కూడా ఏదో చెప్పబోతోంటే హరి చిరాకు పడుతూ నిరసనగా చూసాడు. ''ఏదో సాకులు చెప్పబోతున్నావ్... ఆస్తిలో వాటా లేకుండా చేసేసరికి... నొప్పి కలిగిందా...? నాన్న నీకోసం ఎంత కలవరిస్తున్నాడో చెప్పినా కనికరం లేకుండా... పంపకాల వేళకి మాత్ర వచ్చి పడ్డావ్...! నేను సూటిగా అడిగే ఈ ప్రశ్నకి ముందు జవాబు చెప్పు... ఆ తర్వాత నువ్వు ఏం చెప్పాలనుకుంటున్నావో చెబుదూగానీ! " అంటూ

''అన్నీ మేం ఇద్దరం చూసుకుంటున్నాంకదా, చివరి చూపుకూ రాలేకపోవటానికి నీకు మనసెలా ఒప్పిందిరా...?'' అనడిగాడు తమ్ముడు చంద్రంవైపు సూటిగా చూస్తూ.

''నాన్నకి అనారోగ్యంగా ఉందని ముందుగా తెలిసినపుడు మాత్రం రావాలని అనుకున్నా, వీలు కాలేదు. మాటకూడా రావటం లేదని... ఆఖరు గడియలని తెలియజేసినపుడు మాత్రం నేను తొందరపడి పరుగున రావాలని అనుకోని మాట మాత్రం నిజమే!

మీరు నమ్మినా, నమ్మకపోయినా కారణమూ చెబుతాను. ఆ మధ్య నేనేదో పనిమీద ఇటువేపు వెళ్తూ.. మధ్యలో మన ఊరులో ఆగుదామనిపించి... ఇంటికి వచ్చాను. అజా, పజా లేకుండా అన్ని సంవత్సరాలు నేను కనిపించకుండా పోయినందుకు... ఎన్ని చివాట్లేస్తారోనని ఊహించుకుని అందుకు సిద్ధపడ్డాను!

అయితే, నేను అనుకోని విధంగా అమ్మానాన్నలు నన్ను ఆనందాశ్చర్యాలతో అక్కున చేర్చుకున్నారు! అన్ని సంవత్సరాలుగా వాళ్ళు అనుభవించిన వేదనను తేలిక పడిన మనసులతో విప్పి చెబుతోంటే... నేనెంత తెలివితక్కువ పని చేశానో నాకర్థం అయింది! అంత విలువైన ఆప్యాయతానురాగాలను అన్ని సంవత్సరాలు పోగొట్టుకన్నానని బాధపడ్డాను.

ఆరోజు సాయంకాలం నేను బయలుదేరుతూంటే బస్సుస్టాండు వరకూ నాన్న నా వెంట వచ్చాడు. దారిపొడవునా నాన్న ఉత్సాహంగా నవ్వు మొహంతో కబుర్లు చెబుతూంటే ఆశ్చర్యంగా విన్నాను! మాటి మాటికీ నాన్న అలా నవ్వటం... హుషారుగా మాట్లాడటం నాకు చాలా కొత్తగా, ఆనందంగా అనిపించింది! నేనలా కనుపించటం అమ్మా నాన్నలకి అంత ఆనందం కలిగించిందని అర్థమైంది!

'ఎందుకు నాన్నా... నువ్వు రావటం... నేను వెళ్తాలే...' అంటే నాన్న ''కాదులేరా... నిన్ను బస్సు ఎక్కించి వెళ్తాలే...!'' అని జవాబు చెప్పాడు. నాన్నని తాతయ్య అప్పుడపుడూ సరదాగా 'చలపాయ్' అని పిలిచేవాడని చిన్నపుడెపుడో ఒకసారి చెప్పిన మాట అపుడెందుకోగానీ గుర్తుకు వచ్చింది!

దాంతో సరదాగా మాట్లాడుతున్న నాన్నతోనేనూ నవ్వుతూ " ఏమిటీ... ఇలా బక్కగా ఉన్న నువ్వు, ఇంత బస్తాలా ఉన్న నన్ను బస్సు ఎక్కించగలననే అనుకుంటున్నావా చలపాయ్...! " అనగానే నాన్న భలే మురిసిపోయాడు. 'అచ్చం మా నాన్న అన్నట్లే... ఉందిరా నీ పిలుపూ...' అంటూ తలుచుకుని తలుచుకుని నవ్వాడు.

నేను బస్సులో కూర్చోగానే నా జేబునిండా కొనుక్కొచ్చిన ఇన్ని వేరు శెనగకాయలు పోసి 'కాలక్షేపంగా తినరా... మన ఊరి కాయలు చాలా రుచిగా ఉంటాయి!' అన్నాడు నాన్న.

అమ్మా నాన్నలతో ఆనందంగా గడిచిపోయిన ఆ రోజు నా మనసులో నిలిచిపోయింది! నాన్న నవ్వు మొహం, సరదా మాటలు ఎప్పటికీ మనసులో అలాగే నిలిచి ఉండాలనే ఉద్దేశ్యంతోనూ... మంచం పట్టి నీరసించి, ఆఖరకు మాటకూడా లేని నాన్నను అలా చూడటానికి మనస్కరించకనే... రాలేదు!

''అబ్బ...! ఏం చెప్పావురా, మరి ఇపుడు ఎందుకు వచ్చినట్లో... ఏం చేద్దామనో? ఆస్తి పంపకాల్లో వాటాకోసమే ననే నిజం ఒప్పేసుకో... కొంచమైనా గౌరవంగా ఉంటుంది!'' అన్నాడు గిరి వ్యంగ్యంగా.

విలవిలాడుతున్నట్లు బేలగా చూశాడు చంద్రం.

గొంతు సవరించుకుని చాలా మెల్లగా చెప్పాడు. ''ఆస్తిలోనాకు వాటా నేను కోరుకోవటం లేదు. హరి అన్నయ్య చెప్పినట్లుగా మీరు ఇద్దరే వారసులనే మాటని నేనూ అంగీకరిస్తాను.

అయితే నాదొక మాట ఉంది. ఈ పంపకాలవీ ఇపుడే వద్దు. అమ్మకి ఈ ఊళ్ళోనే ఉండటం ఇష్టం. అనే మాట నాకూ తెలిసింది. అందుకే... ఈ ఇల్లు... ఇలాగే ఉండాలి. అమ్మ ఒక్కతే పొలం పనులు చేయలేదన్నదీ నిజమే... పాలేర్లున్నాగానీ, మనమూ అన్ని విషయాలూ చూసుకోగలగాలి! అందుకే అమ్మకి తోడుగా నేను కుటుంబంతో పాటూ ఇక్కడే ఉండి అమ్మ అజమాయిషీలో వ్యవసాయం పనులు చూసుకోవాలనుకుంటున్నాను.

నాన్నని పోగొట్టుకుని కొండంత దుఃఖంలో ఉన్న అమ్మకు అండగా నిలబడాలనే ఈ నిర్ణయం. మీ ఉద్యోగాలు ఇక్కడికి కొంచెం దగ్గిరే కాబట్టి మునుపటిలానే ఇద్దరూ అపుడపుడూ వచ్చి వెళ్తూ ఉంటే, అమ్మకి బావుంటుంది!

నాన్నలేని లోటును మనం తీర్చలేకపోయినా, పరిస్థితుల్లో అయినా మార్పు లేకుండా చూద్దాం అమ్మ ఇష్టం మీద, మీ దగ్గరకు వచ్చి వెళ్తూండటం బాగానే ఉంటుంది గానీ ఆస్తిపాస్తులన్నీ ఇచ్చేసి... ఏ ఆదారం లేదన్నట్లుగా ఉండటం మాత్రం బావుండదు!

అందరూ చేసేదే మీరూ చేస్తున్నారన్నది నాకూ తెలుసు! కానీ... నా ఉద్దేశ్యంలో అది సరియైన పద్ధతి కాదనిపిస్తోంది! నాన్న కూడా అన్ని విషయాల్లో అమ్మ సలహాకి విలువ ఇచ్చేవాడు. అమ్మని సంప్రదించకుండా ఏపనీ చేసేవాడు కాదని మీకూ తెలుసు! ఇపుడూ అమ్మే ఇంటి యజమానురాలిగా అన్ని పనులూ జరగాలి!

నా అభిప్రాయంలో చివరి చూపు అంటే ఇదే.. ఆఖరి రోజులలో పిల్లలు తల్లిదండ్రులను కనిపెట్టుకు చూడటమే గానీ చనిపోయాక నిర్జీవ శరీరానికి  దండ వేసి, కాళ్ళకు దండం పెట్టుకోవటం మాత్రమే కాదు...!

అందుకే నాకున్న కొద్ది వ్యాపారాన్నీ అక్కడ ఆపేసి, వ్యవసాయంతో పాటూ ఇక్కడే చూసుకుంటాను! అందుకే కుటుంబంతో సహా నా మకాం ఇక్కడికి మార్చేస్తున్నా. ఆ ఏర్పాట్లు వలనే కొంత ఆలశ్యం అయింది!

ఇన్నాళ్ళూ... పోగొట్టుకున్న ఆదరాభిమానాలను మా కుటుంబం ఇప్పటికైనా అమ్మనుండి అందుకోవాలనే ఆశతో... అమ్మనూ చివరిరోజులలో కనిపెట్టుకుని కొంతయినా నా బాధ్యతను నిర్వర్తించాలనే కోరికతోనూ ఈ ఏర్పాటును నేను కోరుకుంటున్నాను. నాకిది చాలు. ఆస్తిపాస్తులలో నాకేం వాటా అవసరం లేదని, అమ్మ తర్వాత మీరే హక్కు దారులనీ ఇపుడు నేనూ రాసి ఇచ్చేస్తాను...!''

ఆ మాటలకు గిరి రుసరుసలాడాడు " అంటే... వాటా వద్దంటూనే, అమ్మతో ఉండి అన్నీ చక్కబెట్టాలనుకుంటున్నావా... అక్కడికి నీకేదో ఆస్తి పాస్తులు ఉన్నట్టుగా కట్టుకథ ఒకటి...! అవన్నీ మూసేస్తాడటా...!''

హరి కూడా చంద్రంవైపు ఒక క్షణం విస్మయంగా చూసి, తర్వాత చిన్నగా నవ్వాడు, వెక్కిరింపుగా అన్నాడు.. ''భలే ప్లాను చేసావురా...! వాటా మాత్రం వద్దు... మొత్తం అంతా నాకే కావాలి అన్నట్లుంది నీ వ్యవహారం! నీ మాటల్ని నమ్మేదెవరూ...!''

''నేను నమ్ముతాను...!'' జవాబు చెప్పింది అనసూయ. నీళ్ళు నిండిన కళ్ళతో చంద్రం వైపు ఆపేక్షగా చూసింది.

''ఏమిటమ్మా ఏమంటున్నావూ...!'' హరి, గిరి ఒక్కసారే ఆశ్చర్యంగా అన్నారు.

''అవును... మీకో విషయం చెప్పాలి...! చంద్రం పట్ల కొడుకనే మమకారం ఉన్నా, వాడు తండ్రి చివరి చూపుకూ రాలేదని కోపం మీలాగే నాకూ ఉంది! అయితే రాత్రి మీ నాన్న వస్తువులు సర్దుతుంటే...

మీనాన్న స్వయంగా రాసిన ఓ ఉత్తరం కనుపించింది. తన అనారోగ్యం గురించి ఆదుర్దాపడుతూనే ఒక విషయం మనకు వివరంగా తెలయజేయాలని రాసారట. ఆ వెంటనే మాటపడిపోవటం, మంచంమీద నుండి కదల లేకపోవటం వలన ఆ ఉత్తరాన్ని పరుపుక్రింద పెట్టారనే విషయాన్ని మనకు చెప్పాలని తాపత్రయపడ్డారు కాబోలు! అది మనకు అర్థం కాలేదు. చంద్రం వచ్చాక చూడండని చెప్పటానికే అంత ఆదుర్దా పడి ఉంటారని ఆ ఉత్తరం చదివాక నాకర్థం అయింది. తర్వాత ఆ ఉత్తరం చదువుదురుగానీ ముందుగా విషయం మాత్రం క్లుప్తంగా చెబుతాను.

ఆ మధ్యలో కరువు వచ్చి మన పొలాల్లో ఏమీ పండక, పాత అప్పులకు తోడుగా కొత్త అప్పూ కలిసి కొండంతగా మారింది! ఏం చేయాలో, ఎలా అప్పు తీర్చాలో తెలియన పరిస్థితుల్లో తరుచూ వచ్చిపోయే కొడుకులిద్దర్నీ సలహా, సహాయం అడిగితే, తమవల్లకాదని, పొలం అమ్మేసి అప్పులు తీర్చెయ్యమని ఖచ్చితంగా చెప్పేసారటకదూ!

అపుడు ఆ రోజుల్లోనే వచ్చిన చంద్రం మీ నాన్న ఏమీ చెప్పకపోయనా పరిస్థితిని పసిగట్టి... అక్కడికి వెళ్ళాక వాడికి ఉన్న ఆయల్ మిల్లుల్ని అమ్మేసి... మీ నాన్నకు డబ్బు పంపించాడట. ‘ఉన్నఊళ్ళో పొలాన్ని అమ్ముకుని... కూలిగా బ్రతకాల్సిన పరిస్థితిని నాన్న భరించలేడని ఇలా చేశాననీ.. తను మళ్ళీ కష్టపడి కుటుంబాన్ని పోషించుకోగలననీ ‘ నాన్నకు భరోసాగా చెప్పాడన్న మాట! అయితే ఇంట్లో వాళ్ళకి, ఊళ్ళోవాళ్ళకీ విషయం తెలియనివ్వద్దని గట్టిగా పట్టుబట్టి చెప్పడంతో ఆ పని మీ నాన్న చేయలేదట. అపుడు ఊళ్ళో వాళ్ళంతా అందరూ ఎవరో స్నేహితుడు సాయం చేయడంతో మీనాన్న అప్పుల ఊబినుండి బయటపడి నిలదొక్కు కోగలిగాడని అనుకున్న మాటల్నే మనమూ నమ్మాం!

అందుకే మీ నాన్న ఈ ఆస్తిపాస్తులన్నిటికీ వాడే స్వంతదారుడని భావించి రాసిన ఉత్తరం అది! అయితే చంద్రం మాత్రం ఈ విషయలేవీ మన దగ్గిర ప్రస్తావించకుండా, నా బాధ్యతలకూ.. పొలం బాగోగులకీ మాత్రమే ప్రాధాన్యత ఇచ్చాడని... ఆ ఉత్తరం చదివాక, ఇపుడు తన మాటలు విన్నాక నాకు అర్థం అయింది...! పిల్లలు తల్లిదండ్రులని ప్రేమగా చూసుకోవటం అంటే....ఆఖరు గడియల్లో ఉండటం...చివరి చూపుకి రావటం మాత్రమే కాదురా...బ్రతికి వున్నప్పుడు వారి బాధ్యతల్లో పాలు పంచుకోవటం, చివరిదాకా వారి ఇష్టాలని గౌరవించటం...నా దృష్టిలో చివరి చూపు కన్నా చాలా గొప్పవి. అలాంటివాడిని మీరు అపార్థం చేసుకుని...’’ అంటూ ఆమె గొంతు పూడుకు పోవటంతో మాటలు ఆపేసింది! “చివరి చూపుకి వచ్చినా, రాకపోయినా....చివరి దాకా నాకు తోడుండాలనే వాడి నిర్ణయాన్ని నేను హర్షిస్తూ సమ్మతం తెలుపుతున్నాను..” అంటూ మెల్లగా, స్థిరంగా తన నిర్ణయాన్ని తెలియజేసింది అనసూయమ్మ.

కోడళ్ళిద్దరితో పాటూ వింటూన్న హరి, గిరి కూడా కొయ్యలైపోయారు!

* * *